క్లుప్తంగా

ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్‌కు శుభాకాంక్షలు



ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

యాచారం: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌గా నియమితులైన వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆదివారం నగరంలో యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాచర్లతో పాటు కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకుడు ఎండీ గౌస్ కలిసి ప్రసాద్‌కుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ యాదవ్, ప్రకాష్, హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజలో శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం నారాయణపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో శ్రీ అభయాంజనేయస్వామి, శివపార్వతులు, నవగ్రహ గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నందీశ్వరుల విగ్రహాలను వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి: బీజేపీ

యాచారం: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషకరమే కానీ ప్రయాణికులపై ఆధారపడి జీవనోపాధి పొందే ఆటో డ్రైవర్ల జీవనోపాధిని కూడా ప్రభుత్వం గుర్తించుకోవాలని బీజేపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గణేష్ నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయాణికులపై ఆధారపడి జీవనోపాధి పొందే ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం కృషి చేయాలని కోరారు. ఆటోలు అత్యధికంగా నడిపించేది ఎస్టీలేనని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటోల్లో ప్రయాణికులెవరు ఎక్కడం లేదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

డప్పుల అందజేత



డప్పులు అందజేసిన ప్రవీణ్‌రెడ్డి

కడ్తాల్: మండల పరిధిలోని వంపూగూడలో క్యాతి వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి స్థానిక దళిత సోదరులకు ఆదివారం డప్పులు అందజేశారు. ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్‌లో వెంకట్‌రెడ్డి జ్ఞాపకార్థంగా గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను స్థానిక నాయకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు అశోక్, మాజీ సర్పంచ్ నరేందర్, తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్, మల్లేశ్, సాయిలు, శివ, నర్సింహ, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

కసిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



ఆమనగల్లు: ఎమ్మెల్యే కసిరెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, అధికారులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పనులు, సమస్యలపై చర్చించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన విద్యానగర్ కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు పాషా, కార్యదర్శి జంగయ్య, కోశాధికారి సుదర్శన్ రెడ్డి, సలహాదారులు పాండు, పత్యానాయక్, చెన్నారెడ్డి, పర్వతాలు, ఆరీఫ్, నర్సింహ, లక్ష్మీనారాయణ, రమేశ్, మాజీ సర్పంచ్ కేశవులు, నాయకులు నవీన్, రమేశ్ తదితరులు ఉన్నారు.

సమస్యల స్వాగతం

కడ్తాల్‌లో కనిపించని అభివృద్ధి
- తాత్కాలిక భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- ప్రభుత్వ ఆస్పత్రి, కళాశాల, బస్టాండ్ నిర్మించాలని డిమాండ్



కడ్తాల్: నూతనంగా ఏర్పడిన మండలంలో ప్రజా సమస్యలతో పాటు అభివృద్ధి పనులు అనుకున్నంత విజయవంతంగా సాగడం లేదు. జిల్లాల, మండలాల పునర్విభజనలో భాగంగా 2016 అక్టోబర్‌లో కడ్తాల్ మండలంగా ఏర్పడింది. అయితే నూతన మండలంలో ప్రజల ఆకాంక్షల అనుగుణంగా అభివృద్ధికానరావడం లేదు. మండలం కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలం ఏర్పడి 7 సంవత్సరాలు పూర్తయ్యినప్పటికీ ఒక పోలీస్ స్టేషన్, మండల విద్యా వనరుల కేంద్ర భవనాలు మాత్రమే నిర్మించగా.. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయ భవనాలు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. అన్నిరకాల ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని.. విద్యా, వైద్యరంగాల అభివృద్ధికి పెద్ద పీట వేయాలని.. మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు ఆలకించండి..

నూతనంగా ఎన్నికైన అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తొలిసారిగా సోమవారం కడ్తాల్‌లో పర్యటిస్తున్న నేపథ్యంలో మండలంలోని ప్రజా సమస్యలు, మండల కేంద్రంలో చేపట్టవలసిన వివిధ అభివృద్ధి పనులను పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలను పరిశీలిస్తే..

- మండల పరిషత్ కార్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండగా.. రెండునెలల క్రితం ఎంపీడీఓ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా నిర్మాణ పనులు సాగుతున్నాయి.
- పాలశీతలీకరణ కేంద్రంలోని భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం నేటికి కొనసాగుతుండగా.. సొంత భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి.
- పశుసంవర్థక భవనంలో వ్యవసాయశాఖ కార్యాలయం నేటికీ కొనసాగుతుండగా.. సొంత భవనం నేటికి నిర్మించలేదు.
- అంగన్‌వాడీ కేంద్ర భవనంలో ఐకేపీ కార్యాలయం కొనసాగుతోంది. నూతన భవన నిర్మాణ పనులు ఇంకా మొదలు కాలేదు.
- కస్తూర్బా పాఠశాల నిర్మాణం పూర్తికాకపోవడంతో అద్దె భవనంలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.
- 40వేల జనభా గల కడ్తాల్ మండలానికి ఆరోగ్య ఉపకేంద్రమే దిక్కుగా మారింది. వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి.
- మండల కేంద్రంలో బస్టాండ్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.
- శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి కావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానికంగా 108 వాహనం ఏర్పాటు చేయాలి.
- పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించినా నేటికి ప్రారంభించలేదు.
- స్థానికంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం వరకైనా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
- మహాత్మ జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలకు సొంత భవనం లేకపోవడంతో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారం సమీపంలోని ఓ కళాశాల భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు.
- మైసిగండి మైసమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలి.
- గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలి.
- మినీ స్టేడియం లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు.
- బాలుర జూనియర్ కళాశాలకు ప్రహరీ నిర్మించాలి.
- కూరగాయల మార్కెట్‌కు సొంత స్థలం కేటాయించి మార్కెట్ నిర్మించాలి.
- మండల కేంద్రంలో సర్వేనంబర్ 65లో 13.19 ఎకరాల విస్తీర్ణంలో గల ఉప్పరాశికుంట, సర్వే నంబర్ 926లో 41.35 ఎకరాల వీస్తీర్ణంలో ఉన్న గుర్లకుంట చెరువు, సర్వేనెంబర్ 720లో 13.27 ఎకరాల్లో గల దేవర చెరువు కలుషితం కావడంతో పాటు ఆక్రమణలకు గురువుతున్నాయి.

వెంటనే పనులు చేపట్టాలి..

మండల కేంద్రంలో అన్నిరకాల ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలి. బస్టాండ్, ప్రభుత్వ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రితో పాటు అన్నిరకాల ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే నిర్మించాలి. ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అధికారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యా, వైద్య రంగాల అభివృద్ధితో పాటు మండల కేంద్రంలో అన్నిరకాల ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు, సౌకర్యాల కల్పనకు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే కృషిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీ

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యేగా విజయం సాధించి మొదటిసారిగా కల్వకుర్తి నియోజకవర్గానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రానున్న నేపథ్యంలో సోమవారం కడ్తాల నుంచి కల్వకుర్తి వరకు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే విజయోత్సవ ర్యాలీ కోసం కాంగ్రెస్ శ్రేణులు, కసిరెడ్డి అభిమానులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కడ్తాల మండల కేంద్రం నుంచి విజయోత్సవ ర్యాలీని ప్రారంభించి ఆమనగల్లు, వెల్దండ మండలాల మీదుగా కల్వకుర్తి వరకు నిర్వహించనున్నారు.తెలంగాణలోకాంగ్రెస్‌తోనే సమస్యాయం సాధ్యమన్నారు. విజయోత్సవ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

కార్యకర్తలు తరలిరావాలి..

కడ్తాల్: కల్వకుర్తి ఎమ్మెల్యేగా కసిరెడ్డి నారాయణరెడ్డి సోమవారం కడ్తాల్ నుంచి కల్వకుర్తి వరకు చేపట్టనున్న విజయోత్సవ ర్యాలీకి పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కడ్తాల్ నుండి కల్వకుర్తి వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సేవాదళ్ మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, నాయకులు యాదయ్యగౌడ్, మల్లయ్య, సత్యంయాదవ్, దయాకర్‌రెడ్డి, శ్రీను, రాజేశ్, శ్రీశైలం, భానుకిరణ్, వంశీ, శ్రీకాంత్ ఉన్నారు.

ట్రాఫిక్ జాం



వాగ్వాదానికి దిగిన కార్ల యజమానులు

తుర్కయంజాల్: సాగర్ రహదారి తుర్కయంజాల్‌లో రెండు కార్ల యజమానుల నిర్లక్ష్యం కారణంగా భారీగా ట్రాఫిక్ స్తంభించింది. చౌరస్తాలోని ఓ వస్త్ర దుకాణం ముందు ఆదివారం మధ్యాహ్నం నిలిపి ఉన్న ఇన్నోవా కారు, డిజైర్ కార్లు ఒకదానికి ఒకటి ఢీకొని స్వల్పంగా డ్యామేజీ అయ్యాయి. దీంతో రెండు కార్లకు చెందిన వ్యక్తులు రోడ్డుపైనే వాగ్వాదానికి దిగడంతో సుమారు అరగంట పాటు భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యం రద్దీగా ఉండే తుర్కయంజాల్ చౌరస్తాలో కనీసం ఒక్క ట్రాఫిక్ పోలీస్ కూడా లేకపోవడంతో నిత్యం ఇలాంటి వివాదాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. పోలీసులు ఇప్పటికైనా స్పందించి ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను కేటాయించడంతో పాటు పార్కింగ్ సదుపాయం కల్పించని దుకాణందారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే రంగారెడ్డికి సన్మానం



ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా ఎన్నికైన మల్‌రెడ్డి రంగారెడ్డిని ఎంపీపటేల్ గూడ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురేందర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు .

సన్మానించిన నేతలు..

ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం తొలిసారిగా ఆదివారం ఇబ్రహీంపట్నం వచ్చిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉద్యమ కారుడు బర్ల జగదీశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ కప్పరి లక్ష్మయ్య, కౌన్సిలర్ బర్ల మంగ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఇబ్రహీంపట్నం రూరల్: మల్‌రెడ్డి రంగారెడ్డిని సన్మానించిన నాయకులు

తాటిచెట్టు పైనుంచి పడి..

గీత కార్మికుడి మృతి



కాశయ్య మృతదేహం

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కవాడిపల్లికి చెందిన సుర్వి కాశయ్యగౌడ్(46) గీత కార్మికుడు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కిన కాశయ్య ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కింద పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి సోదరుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడు కాశయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు .

ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటుంది

డీటీ మాచన రఘునందన్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీటీ రఘునందన్

ఆమనగల్లు: ధాన్యం అమ్మకాల విషయమై రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ సూచించారు. ఆమనగల్లు మండల పరిధిలోని హైదబాద్-శ్రీశైలం జాతీయ రహదారి పక్కన రైతులు ఆరబోసిన వరిధాన్యాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. రైతులతో రఘునందన్ మాట్లాడుతూ.. రైతులు పండించిన వరిధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. వరిధాన్యాన్ని గ్రేడ్-ఎ, గ్రేడ్-బీ రకాలుగా విభజించి కొనుగోలు చేస్తుందని దీనిపై రైతులు అపోహలకు గురికావద్దని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయిస్తే మిల్లర్లు తేమ పేరిట క్వింటాల్ వడ్లపై తరుగు వేస్తారని, తూకాల్లో కూడా మోసాలు చేసే అవకాశం ఉంటుందని అన్నారు. మిల్లర్లు దళారులను ప్రోత్సహించవద్దని రైతులను మోసం చేయవద్దని సూచించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యంలో నిర్ణీత తేమశాతం, నాణ్యత ఉంటే విక్రయాల్లో సమస్యలు ఉత్పన్నం కావని రఘునందన్ స్పష్టం చేశారు.

ఆరు గ్యారంటీలతో పేదలకు మేలు

కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్



బస్సును ప్రారంభిస్తున్న రమేష్

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరి రమేష్ పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలంలోని తులేకలాన్‌లో మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం సౌకర్యాన్ని ఆయన ప్రారంభించారు. బస్సులో మహిళలను ఎక్కించి పథకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాండు, శశాంక్‌రెడ్డి, విజయ్, మహేందర్, మైసయ్య, శివ, ప్రభు, ప్రవీణ్, సాయి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌తో వివరాలు తెలుసుకుంటున్న కోదండరెడ్డి

కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

యాచారం: మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. మాజీ టీపీసీసీ అధ్యక్షుడు వీహెచ్‌తో కలిసి ఆదివారం నగరంలోని యశోధ ఆస్పత్రిలో కేసీఆర్‌ను ఆయన పరామర్శించారు. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు.



మంత్రి జూపల్లికి సత్కారం

సచివాలయంలో మంత్రిగా భాద్యతలు స్వీకరించిన జూపల్లి కృష్ణారావ్‌ను ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

– ఆమనగల్లు

ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకోవాలి

- ఆరు గ్యారంటీలు తప్పకుండా అమలవుతాయి
- మేయర్ చిగురింత పారిజాతరెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్, పీసీసీ కార్యదర్శి చిగురింత పారిజాత రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆరు గ్యారంటీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకాన్ని ఆమె ప్రారంభించి స్థానిక మహిళలతో ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేశారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పాటైన రెండు రోజుల్లోనే రెండు గ్యారంటీలను అమలు చేశారన్నారు. డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్, కందుకూరు ఎంపీపీ జ్యోతి, వైస్‌ఎంపీపీ శమంత, తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్మన్ మధుమోహన్, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

కందుకూరు: ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి అందరూ రుణపడి ఉంటామని వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి ఎండీ అఫ్జల్‌బేగ్ కొనియాడారు. ఆదివారం మండలంలోని నేదునూరులో మహిళలు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సును వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలను కేవలం రెండు రోజుల్లోనే సీఎం అమలు చేయడం గర్వంగా ఉందన్నారు. అందరూ పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. నాయకులు బాలయ్య, బలవంత్‌రెడ్డి, శ్రీశైలం, అమీన్‌బేగ్, సురేష్, సంజీవ, పెంటయ్య, ఎండీ పాషా, జగన్ పాల్గొన్నారు.

వనస్థలిపురం: తెలంగాణలో నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచిన నేపథ్యంలో ఆదివారం వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సదరు పథకాన్ని ప్రారంభించారు. అలాగే ఎన్జీఓస్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ ప్రయాణ పథకాన్ని ఆయన ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ హరిప్రియ, నాయకులు పాల్గొన్నారు.

చలి వేళ.. గిరాకీ భళా

- జోరుగా స్వెట్టర్ల విక్రయాలు
- జల్‌పల్లి పరిధిలో వెలసిన దుకాణాలు



ఎర్రకుంటలో స్వెట్టర్ల విక్రయం

పహాడీషరీఫ్: చలి పులి పంజా విసురుతుండడంతో నగర శివారు ప్రజలు వణికిపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో చలి తీవ్రత అధికమై కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటికి రాలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. స్వెట్టర్లు ధరించకుండా తిరిగే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో స్వెట్టర్లు, దుప్పట్లకు భలే గిరాకీ ఏర్పడింది. మధ్యప్రదేశ్, పంజాబ్ నుంచి వీటిని కొనుగోలు చేసి వ్యాపారులు జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎర్రకుంట, షాహిన్‌నగర్, పహాడీషరీఫ్ ప్రధాన రహదారులపై గూడారాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. పాత స్వెట్టర్లు ఉన్నప్పటికీ అవి చలిని తట్టుకోలేవని చాలా మంది కొత్త వాటిని కొనుగోలు చేస్తున్నారు. రూ.400 నుంచి మొదలు కొని రూ.1000 వరకు ఈ స్వెట్టర్ల ధరలు ఉన్నాయి. ముఖ్యంగా చిన్నారులకు సంబంధించిన స్వెట్టర్లను పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. దుప్పట్ల ధరలు కూడా రూ.300 నుంచి రూ.600 వరకు పలుకుతున్నాయి. ఉదయం వేళల్లో పారిశుద్ధ్య కార్మికులు చలి తీవ్రతకు రహదారుల వెంబడి మంటలు కాసుకుంటున్నారు.

అందుబాటులోకి కొత్త డిజైన్లు..

చలి ఉంటున్నప్పటికీ తప్పనిసరి బయటికి వెళ్లాల్సిన వారి కోసం కొత్త డిజైన్ల స్వెటర్లు అందుబాటులోకి వచ్చాయి. మంకీ క్యాప్‌లు, కేవలం చెవులకు మాత్రమే సరిపోయేలా మఫ్లర్‌లు కొత్తవి రూపొందించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా హాయిగా నిద్రపోయేలా దుప్పట్లు, రగ్గులు కూడా అందుబాటులో ఉన్నాయి. డిసెంబర్, జనవరి మాసాలలో చలి పులి మరింత పంజా విసరనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఇంటిల్లిపాది కోసం వీటిని కొనుగోలు చేస్తున్నారు.

ఆరు నెలల పాటు అమ్మకాలు..

మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లకు చెందిన వ్యాపారులు ఈ స్వెటర్లను విక్రయిస్తుంటారు. ప్రధాన రహదారుల పక్కన గూడారాలు ఏర్పాటు చేసుకొని ఏడాదిలో ఆరు నెలల పాటు విక్రయాలు కొనసాగిస్తుంటారు. వర్షాకాలం ఆరంభంలో వీటి అమ్మకాలు ప్రారంభమయి చలికాలం ముగిసేంత వరకు కొనసాగిస్తారు. వర్షాకాలంలో రెయిన్ కోట్‌లను విక్రయిస్తున్న వ్యాపారులు, శీతాకాలంలో స్వెట్టర్లను అమ్ముతున్నారు.

తక్కువ ధరలకే విక్రయం



గతేడాది కంటే ఈసారి చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజల నుంచి డిమాండ్ పెద్ద స్థాయిలో ఉంది. తమ వద్ద ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలే కొనుగోలు చేస్తుండడాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ ధరలకే విక్రయిస్తున్నాం. చలి నుంచి ఉపశమనం పొందేలా ఈ ఏడాది మార్కెట్‌లోకి ఢిల్లీ, లుథియానా నుంచి అధునాతన స్వెట్టర్లను అందుబాటులోకి తీసుకొచ్చాం.

– మహ్మద్ అలీ, వ్యాపారి

చలి ఎక్కువగా ఉంది



నవంబర్ మాసం నుంచే చలి గజగజ వణికిస్తుంది. ఇంతటి చలి పులి నుంచి తట్టుకోవాలంటే స్వెట్టర్లు తప్పనిసరి వాడాల్సి వస్తుంది. గతంలో వీటిని కొనుగోలు చేయాలంటే కోఠి వెళ్లాల్సి వచ్చేది. కానీ గత మూడేళ్లుగా ఎర్రకుంట, పహాడీషరీఫ్, తుక్కుగూడ, కాటేదాన్ ప్రధాన రహదారులపై గూడారాలు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. వ్యాపారులు ఇదే సీజన్‌గా భావించి ఎక్కువ ధరలు విక్రయించకుండా ధరలు మరింత తగ్గిస్తే బాగుటుంది.

– ఉస్మాన్, ఎర్రకుంట